

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్ అచ్యుత్‌రెడ్డి మార్గ్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్, మాతా వాకర్స్‌క్లబ్ నల్లకుంట, అచ్యుత్‌రెడ్డి మార్గ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వందమందిని వైద్యులు పరీక్షించారు. సుధాకర్ పైప్స్ ఎండీ, వాసవీ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు అనంతుల దయాకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు నాగభూషణం, మాతా వాకర్స్‌క్లబ్ నల్లకుంట అధ్యక్షుడు డాక్టర్ వై. మురళీధర్, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన ఏఎస్ఐని అరెస్ట్ చేయాలి

చిక్కడపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది రవికుమార్‌పై దాడి చేసిన సిద్దిపేట టూ టౌన్ ఏఎస్ఐని వెంటనే అరెస్ట్ చేయాలని సామాజిక న్యాయ గ్రామీణాభివృద్ధి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కొండూరు వినోద్‌కుమార్, కార్యదర్శి ఎం. సునీత డిమాండ్ చేశారు. న్యాయవాదులపై రోజురోజుకు దాడులు జరగడంపై విచారం వ్యక్తం చేశారు. విధినిర్వహణలో ఉన్న న్యాయవాది పైనే పోలీసులు దాడికి పాల్పడితే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.



డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి

ముషీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. గురువారం ఎంసీహెచ్ కాలనీలో రూ.6 లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్‌లను ఆధునికీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, నాయకులు, రమేష్, వేణు పాల్గొన్నారు.

నేడు డెంగీపై అవగాహన సదస్సు

ముషీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (యూపీహెచ్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు డెంగీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ దీప్తి ప్రియాంక తెలిపారు. ఉదయం 11.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు.

పార్కులో అభివృద్ధి పనులను పూర్తి చేయండి

చిక్కడపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో పి అండ్ టి కాలనీపార్క్(సురభి పార్క్)లో అభివృద్ధి, సుందరీకరణ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ అధికారులకు సూచించారు. రాత్రి సమయంలో పార్కులో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. హార్టికల్చర్ విభాగం సర్కిల్ మేనేజర్ భాస్కర్, సూపర్‌వైజర్ వికాస్‌తో కలిసి గురువారం పార్కును సందర్శించారు. సురభి పార్కుతోపాటు డివిజన్‌లోని ఇతర పార్కుల సుందరీకరణకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పార్కును సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

చలాన్లకే పరిమితమవుతున్న ట్రాఫిక్ పోలీసులు

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణను పోలీసులు పట్టించుకోవడం లేదని, చలాన్లకే పరిమితమవుతున్నారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా ఆరోపించారు. గురువారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చలాన్లకే పరిమితం కాకుండా ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ప్రకాష్, శ్యామ్, జి. యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

16న సుద్దాల హనుమంతు ప్రజాపాట సభ

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాటకు పరిపర దండాలు పేరుతో ప్రజాకవి సుద్దాల హనుమంతు సాహిత్యం - జీవితం - సమగ్ర రచన పుస్తకావిష్కరణ, సాంస్కృతిక ఉత్సవాలను ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎస్వీకే కార్యదర్శి ఎస్. వినయ్‌కుమార్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, బాల సంఘం అధ్యక్షుడు సోమయ్య, బుక్ హౌస్ ఎడిటర్ ఆనందచారి తదితరులు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రముఖ సినీ నటుడు ఉత్తేజ్, విమలక్క, సుద్దాల అశోక్‌తేజ తదితరులు పాల్గొంటారని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్వీకే కార్యదర్శి ఎస్. వినయ్‌కుమార్ తదితరులు

సుందరయ్యపార్కు చుట్టూ..

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించండి

సిబ్బందికి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశం

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సుందరయ్య పార్కు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను వెంటనే తొలగించాలని సిబ్బందిని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో సికింద్రాబాద్ జోన్ కమిషనర్ రవికిరణ్, హౌస్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కిషన్‌రావు, అధికారులతో కలిసి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు, చుట్టూ పక్కల ప్రాంతాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, పార్కులో వాకర్స్ సమస్యలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ పరిశీలించారు. వాకర్స్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులు, జ్యూస్ సెంటర్లను తొలగించాలని పలువురు వాకర్స్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో చిన్నపాటి వర్షానికే నీరు నిలుస్తోందని, సమస్యను పరిష్కరించాలని, విరిగిపోయిన చిన్నపిల్లల ఆట పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, బ్యాడ్మింటన్ కోర్టును ఆధునికీకరించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్) దేవానందం, ఎస్ఈ సురేష్, ఈఈ గోపాల్, డీఎంసీ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య పార్కును సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సికింద్రాబాద్ జోన్ కమిషనర్ రవికిరణ్

అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నల్లకుంట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మాతృమూర్తి పేరిట ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సూచించారు. గురువారం బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆలోచన మేరకు మొక్కలు నాటే కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుందన్నారు. మొక్కలు నాటితే పర్యావరణాన్ని పరిరక్షించిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, కార్పొరేటర్లు వై. అమృత, కన్నె ఉమాదేవి, బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ ఎం. శ్యామ్‌రాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: పటేల్‌నగర్‌లో బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. యశ్వంత్ తన తల్లి పేరిట మొక్క నాటారు.



బీజేపీ నగర కార్యాలయంలో మొక్క నాటి నీరు పోస్తున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, కార్పొరేటర్లు వై. అమృత, కన్నె ఉమాదేవి

ఉప్పులూరి సేవలు అనిర్వచనీయం

రవీంద్రభారతి, జూలై 11 (ఆంధ్రప్రదేశ్): జీవితాంతం కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా కొనసాగిన ఉప్పులూరి మల్లికార్జునశర్మ సేవలు అనిర్వచనీయమని వక్తలు పేర్కొన్నారు. రవీంద్రభారతిలో జానకి మల్లికార్జునశర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధేయవాది డా. ఉప్పులూరి మల్లికార్జునశర్మ 86వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. అతిథులుగా మాజీ ఎంపీ వి. హనుమంతరావు, కేవీపీ రామచందరరావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లికార్జునశర్మ చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా జీవించారని అన్నారు. అసలు సిసలైన కాంగ్రెస్ వాది అని కొనియాడారు. ఆయన ప్రతి మాటలో దేశభక్తి ఉండేదని గుర్తుచేసుకున్నారు.

కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞశర్మ, సీనియర్ నాయకుడు దయానంద్, రాజలింగం, రాజశేఖర్, రఘురామయ్య, మల్లికార్జునశర్మ కుమారుడు ఉప్పులూరి శ్రీనివాసాచార్య తదితరులు పాల్గొన్నారు.



ఉప్పులూరి మల్లికార్జునశర్మకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు తదితరులు

అందరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

రవీంద్రభారతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి మనిషికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని శ్రీచక్ర లలితా ఆదిపరాశక్తి ఉపాసకులు ఉదయచంద్రయోగి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, వాగ్దేవి సంస్థ ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత, సాంస్కృతిక విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల భక్తి, లలిత, విషాద, యుగళ గీతాలాపనతో పాటు ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. చక్కటి స్వరాలతో గాయనీగాయకులు ప్రేక్షకులను మైమరిపించారు. భక్తి, లలిత గీతాలతో ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో కోలేటి దామోదర్‌గుప్తా, మూసాపేట రామరాజు, మహాలక్ష్మి రామన్‌గౌడ్, దైవజ్ఞశర్మ, సదాశివ శర్మ, రాధాకృష్ణ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. అతిథులు మాట్లాడుతూ..ఈతరం యువతకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగకరమని అన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గురుజీ ఉదయ చంద్రయోగి, కోలేటి దామోదర్‌గుప్తా తదితరులు

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

బర్కత్‌పుర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటికి బానిస అయితే జీవితం దుర్భరంగా మారుతుందని యాంటీ నార్కోటిక్ ఎస్పీ సీతారాం అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిర్మాన్ విద్యార్థి సేన ఆధ్వర్యంలో డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కై యంగ్ సైరన్ కార్యక్రమం పేరిట సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు బానిస అవుతున్న యువతకు అవగాహన కార్యక్రమాలకు తెలంగాణ నవ నిర్మాణ్ విద్యార్థి సేన యంగ్ సైరన్ పేరిట శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. టీఎన్‌వీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని మహోద్యమంగా ముందుకు తీసుకెళ్లి అన్ని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ కేఎస్.రావు, ఏసీపీ సుబ్బిరామిరెడ్డి, డాక్టర్ సునీల్, బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బిశ్వ ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యాంటీ నార్కోటిక్ ఎస్పీ సీతారాం తదితరులు

విద్యుత్ సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వొద్దు

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సౌత్ సర్కిల్‌ను అదానీ గ్రూపునకు ఇవ్వాలని చేస్తున్న ప్రయత్నాలను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. సౌత్ సర్కిల్‌లో కరెంటు చోరీ జరుగుతున్నదని, బిల్లులు సరిగా కట్టడం లేదని, ఆదాయం తక్కువగా ఉందని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. సంస్థ బిల్లుల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ఉద్యోగులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని రాజకీయాలకు తలొగ్గకుండా డీపీఈ, విజిలెన్స్‌లను వినియోగించుకుంటూ పనిచేస్తే అన్ని యూనియన్లు సహకరిస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోని ఉద్యోగులు పోరాడుతున్న నేపథ్యంలో ప్రైవేటు సంస్థలకు సౌత్ సర్కిల్‌ను కట్టబెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న యూనియన్ ప్రతినిధులు

ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలంటూ మోసం

నగర వాసి నుంచి రూ. 8.99 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధికలాభాలు వస్తాయంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగిని మోసం చేశారు. పెట్టుబడుల పేరుతో రూ. 8.99 లక్షలు కాజేశారు. డీసీపీ కవిత ధార తెలిపిన వివరాల ప్రకారం..

నగరానికి చెందిన 34 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగికి ఫేస్‌బుక్‌లో ఒక ప్రకటన కనిపించింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయంటూ అందులో రాసి ఉంది. బాధితుడు ప్రకటనలో ఉన్న ఫోన్ నంబర్‌లలో సంప్రదించాడు. స్పందించిన గుర్తుతెలియని వ్యక్తులు అతడి ఫోన్ నంబర్‌ను ఎవర్‌కోర్ ఫుల్ప్ స్టాక్ పుల్లింగ్ గ్రూపు, వీఐపీ కన్సల్టేషన్ సర్వీస్-34 గ్రూపుల్లో యాడ్ చేశారు.

ఆ తర్వాత ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఏటీఎం కార్డులను వాట్సాప్‌లో తెప్పించుకున్న నేరగాళ్లు అతడితో ఎఫ్‌వైఎస్ఎల్‌టీడీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఆ తర్వాత దశలవారీగా పెట్టుబడులు పెట్టించారు. మొదట్లో లాభాలు వచ్చినట్లు చూపించి విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. అలా రూ.86,041 లాభాల రూపంలో విత్ డ్రా చేసుకున్నాడు. దాంతో అతడికి మరింత నమ్మకం కలిగింది. ఎక్కువ మొత్తంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో బాధితుడు దశలవారీగా 8.99 లక్షలు పెట్టుబడి పెట్టాడు. డబ్బులు చేతికి అందిన తర్వాత నిందితులు విత్‌డ్రా ఆప్షన్ క్లోజ్ చేశారు.

బాధితుడు ప్రశ్నించగా.. పెట్టుబడి పెట్టమంటున్నారే తప్ప విత్‌డ్రా ఆప్షన్ ఇవ్వడంలేదు. మోసపోయానని గ్రహించి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



అసదుద్దీన్ ఒవైసీతో సమావేశమైన ఆర్. కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కేంద్రం బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోంది

● పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని

అసదుద్దీన్ ఒవైసీతో ఆర్. కృష్ణయ్య చర్చలు

రాంనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయిన బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో జనాభా ప్రకారం వాటా దక్కడం లేదని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో దారుసలాంలో ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం గురువారం చర్చించింది. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల అభివృద్ధికి అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా తెలిసిందన్నారు. 56 శాతం జనాభా గల బీసీలకు రాజకీయ రంగంలో 14 శాతం, ఉద్యోగ రంగంలో 9 శాతం, పారిశ్రామిక రంగలో ఒక శాతం, ప్రైవేట్ రంగంలోని ఉద్యోగాలలో 5 శాతం కేటాయించాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఎంఐఎం పక్షాన ప్రైవేట్ బీసీ బిల్లు పెడతామని అసదుద్దీన్ ఒవైసీ హామీ ఇచ్చారని ఆర్. కృష్ణయ్య తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు అనంతయ్య, సి.రాజేందర్, కోలా జనార్దన్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

● కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన

ఖైరతాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడం శోచనీయమని, వెంటనే వాటిని విడుదల చేసి విద్యార్థుల ఉన్నత చదువులను ప్రోత్సహించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5 సంవత్సరాల నుంచి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లకు చేరుకున్నాయన్నారు. వెంటనే నిధులను విడుదల చేయకపోతే సీఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ కార్యదర్శి అశోక్‌రెడ్డితో పాటు ప్రతినిధులు లెనిన్, స్టాలిన్, చరణ్‌శ్రీ, సునీల్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

సహారా గ్రూప్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

నల్లకుంట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సహారా గ్రూప్ ఉద్యోగులకు న్యాయం చేయాలని హైదరాబాద్, సికింద్రాబాద్ సహారా ఇండియా పరివార్ ఇన్‌చార్జి రవీంద్రరావు, ప్రభాకర్ ఆధ్వర్యంలోని ఓ ప్రతినిధి బృందం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. తమకు వేతనాల బకాయిలు చెల్లించడం లేదని, ఖాతాదారులు, ఏజెంట్ల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో హైదరాబాద్ ఆర్ఎం షేక్ సోను, సాహెబ్, సికింద్రాబాద్ ఆర్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'శకున శాస్త్ర సర్వస్వం' ఆవిష్కరణ

చిక్కడపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రథం సాంస్కృతిక సాహిత్య వికాస సంస్థ ఆధ్వర్యంలో కోటిపల్లి సుబ్బారావు రచించిన శకున శాస్త్ర సర్వస్వం గ్రంథావిష్కరణ సభ గురువారం సాయంత్రం త్యాగరాయగానసభలో జరిగింది. ప్రముఖ జ్యోతిష శాస్త్ర పండితుడు ఆచార్య సోమంచి సత్యనారాయణ మూర్తి గ్రంథాన్ని ఆవిష్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, ప్రముఖ జ్యోతిష పండితులు డి. సూర్యనారాయణ. డా. నూనె వెంకటయ్య, సంస్థ నిర్వాహకుడు కొంపెల్ల శర్మ పాల్గొన్నారు.

పటాన్ బస్తీలో ఫాగింగ్ చేయాలి

ముషీరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పటాన్ బస్తీలో దోమల వ్యాప్తి వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని సీపీఎం నగర నాయకుడు బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్తీలో ఫాగింగ్ చేయాలని కోరారు.

దత్తసాయి కాంప్లెక్స్‌లో..

తెల్లవారు జాము వరకూ మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది

చిక్కడపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో దత్తసాయి కాంప్లెక్స్‌లో బుధవారం అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. గురువారం తెల్లవారు జాము వరకు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారని ముషీరాబాద్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

మెట్టు సాయికుమార్‌కు పలువురి అభినందన

అంబర్‌పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితుడైన మెట్టు సాయికుమార్‌ను పలువురు అభినందించారు. బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. యశ్వంత్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోటం అనిల్‌కుమార్ సాయికుమార్‌ను శాలువాతో సత్కరించారు.

'క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం'

యూసు‌ఫ్‌గూడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు మరింత ప్రోత్సాహం అందిస్తుందని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ప్రముఖ రెజ్లర్ బొద్దం మహేష్‌యాదవ్ జ్ఞాపకార్థం ఇంటర్నేషనల్ రెజ్లర్ కిరణ్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో అండర్-23 హైదరాబాద్ జిల్లా రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు.

స్విమ్మింగ్ పూల్‌కు షాక్..

● 18 మందికి స్వల్ప గాయాలు

పహాడిషరీఫ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సరదా కోసం స్విమ్మింగ్ పూల్‌లో దిగిన పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జల్‌పల్లిలో గురువారం సాయంత్రం మరాఠా భవన్ సమీపంలోగల ఫామ్‌హౌస్‌లో ఓ కుటుంబం విందు చేసుకుంది. అనంతరం ఫామ్‌హౌస్ ప్రాంగణంలోని స్విమింగ్‌పూల్‌లో 18 మంది సరదాగా ఈత కొడుతున్నారు.

ఈ క్రమంలో స్విమింగ్‌పూల్‌పై నుంచి ఉన్న హై టెన్షన్ వైర్లు గాలికి కింద ఉన్న ఈత చెట్టు కొమ్మకు తగలడంతో కాలిపోయింది. ఈత చెట్టుకు తాకిన వైర్ల ద్వారా స్విమింగ్‌పూల్ లోపలికి ఎర్త్ రావడంతో ఈత కొడుతున్న వారు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. కుటుంబ సభ్యులు, స్థానికులు వారిని మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. 16 మంది డిశ్చార్జి అయ్యారు. ఇద్దరు చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.